ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 10 డిసెంబరు 2025 | 5



'అన్నవరం' ఈవోగా వేండ్ర త్రినాథరావు 7

తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ రత్నావతి కన్నుమూత 7

సమరానికి సిద్ధం!

- నేటి నుంచి సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలు
- జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో ఏఐయూ న్యూఢిల్లీ సహకారంతో నిర్వహణ
- ఆరు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 138 జట్లు

6

నేటి నుంచి టెట్ పరీక్షలు

- ఐదు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- పరీక్షలకు హాజరుకానున్న 9,659 మంది అభ్యర్థులు
- నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- డీఈవో పి.రమేష్

కాకినాడ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీ టెట్-2025కు సంబంధించిన పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయని జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 21వరకూ జరుగుతాయని జిల్లాలో మొత్తం 9,659మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు.కాకినాడలోని ఐయాన్ డిజిటల్ జోన్, సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లోను పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి తప్పనిసరిగా ఒరిజనల్ ఫొటో గుర్తింపు కార్డుతో హాజరుకావాలని, పరీక్షలను పర్యవేక్షించేందుకు ఐదుగురు ఎంఈవోలను, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించామని నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. టెట్ పరీక్ష రాస్తున్న ఇన్ సర్వీస్ టీచర్లు పరీక్ష దినం రోజున తప్పనిసరిగా సెలవుకు దరఖాస్తు చేసుకుని పరీక్షకు హాజరుకావాలన్నారు. వివరాలకు 98480 82815, 77996 98462 నెంబర్లలో సంప్రదించాలని డీఈవో సూచించారు.

7

కాకినాడలో పట్టపగలు హత్య

అక్క కుమార్తెకు వేడుక చేద్దామనుకుంటే

- విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి
- వేడుక ఇంట్లో శోకం..
- కత్తిపూడిలో ఘటన

7

సత్తా చాటిన తుని యువకుడు 7

- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం

తిమ్మాపురంలో ఉద్రిక్తత

- భవనం ఖాళీ చేయించేందుకు భారీగా పోలీసుల మోహరింపు

7

ఇంత 'చిన్న' చూపేంటి?



- ఉమ్మడి జిల్లాల్లో చిన్ననీటి పారుదల వ్యవస్థ నిర్వీర్యం
- పదేళ్లుగా రిపేర్లకూ నిధులివ్వని వైనం
- ఏజెన్సీ ఎత్తిపోతల పథకాలన్నీ దాదాపుగా మూత
- నిర్వహణ బాధ్యత కార్పొరేట్‌కు అప్పగించే యోచన
- ఇప్పటికే రూ.600 కోట్లతో ప్రతిపాదనలు
- ఇది అమలైతే వేల ఎకరాలకు పుష్కలంగా సాగునీరు
- అయినా రోజులు గడుస్తున్నా ముందుకు కదలని వైనం

గోదావరి జిల్లాలో నీరు పుష్కలంగా ఉంటుందనేది చాలామంది అభిప్రాయం. కానీ ఇక్కడా మెట్ట ప్రాంతం ఉంది. అటు కాలువల నీరూ, ఇటు బోరు నీరు కూడా లభ్యంకాని పొలాలు వేలాది హెక్టార్లలో ఉన్నాయి. వీటిని సాగు చేయడానికి గతంలో ఏర్పాటుచేసిన చిన్న నీటిపారుదల వ్యవస్థ నిర్వీర్యమై పోయింది. ముఖ్యంగా గత వైసీపీ హయాంలో పైసా విదల్చలేదు. దీంతో మొత్తం చిన్న నీటిపారుదల వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైపోయింది. దీన్ని సరిదిద్ది, ఆయా ఎత్తిపోతల పథకాలకు జీవం పోసేందుకు ప్రభుత్వం దృష్టిపెట్టింది. అయితే అవి ప్రతిపాదనల దశ దాటకపోవడం అన్నదాతలకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది.



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కాలువల ద్వారా నీటి సరఫరా లేని మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో వ్యవసాయం చేయడంకోసం 1974లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల సంస్థ (ఏపీఐడీ) ఏర్పడింది. ఇది ప్రధానంగా ఎత్తిపోతల పథకాల ఏర్పాటు, నిర్వహణ కోసం పనిచేస్తోంది. కనీసం 50 ఎకరాల నుంచి 5 వేల ఎకరాల వరకూ ఉన్న భూముల కోసం ప్రభుత్వం ఒక్కొక్క ఎత్తిపోతల పథకం నిర్మించి రైతులకు అప్పగించింది. ముఖ్యంగా గోదావరి, కాల్వలు, డ్రైన్ల నుంచి నీటిని ఎత్తిపోసి పంటలు పండించడానికి చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. వాటికి ఉచిత కరెంట్ ఇచ్చేది. ఇక వాటి నిర్వహణ, తూడు, డీసిల్టేషన్, చిన్నచిన్న రిపేర్లు వంటివి రైతులు చేసుకోవాలి. దీనికోసం 11 మందితో రైతు కమిటీ ఉంటుంది. రైతుల నుంచి ఎకరాకు రూ.500 నుంచి 1000 వరకూ ఏడాదికి వసూలుచేసి ఎత్తిపోతల పథకాలను మెయింటెనెన్స్ చేస్తారు. పూర్తి మరమ్మతులు వస్తే ప్రభుత్వమే బాగు చేయిస్తుంది. పదేళ్ల నుంచి పాలకులు వీటిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. నిర్వహణకు ఇబ్బంది లేకుండా కొంత సాయం అందించి చేతులు దులిపేసుకున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటికోసం పైసా విదల్చలేదు. దాంతో కొన్ని ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. మరమ్మతులు లేక ఆ ఎత్తిపోతల ఆయకట్టులో సాగు నిలిచిపోయింది.

ఎక్కడెక్కడ.. పంపింగ్ స్కీములెన్ని..

మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో చిన్న, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలు గోదావరి జిల్లాల్లో పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 పంపింగ్ స్కీమ్‌లుండగా, వాటి పరిధిలో 37,450 ఎకరాల ఆయకట్టు ఉండేది. దీంట్లో పోలవరం ప్రాజెక్టు ముంపు వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో 50 ఎత్తిపోతల పథకాలు పనిచేయకుండాపోగా, మరో 20 ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యమయ్యాయి. కొంతకాలం వీటిని మైక్రో ఇరిగేషన్ డెవలప్మెంట్ సంస్థ తన అధీనంలో నిర్వహించినా, ఏజెన్సీ ప్రజల్లో స్పందన లేదనే కారణంతో ఇది కూడా వదిలేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 35 స్కీమ్‌లు ఉండగా, అందులో ఆరింటింటిని మొత్తం తొలగించారు. ఇక 29 స్కీమ్‌ల కింద 55,113 ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో కొన్ని ఎకరాలకు మాత్రమే నీటిసరఫరా అవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో కాటవరం, కుమారదేవం, వేగేశ్వ రపురం, పైడిమెట్ట, చాగల్లు బ్రాహ్మణగూడెం వంటివి మాత్రం ఓ మాదిరిగా పనిచేస్తున్నాయి. వేములవాడ -1,2, పెదపూడి, పల్లిపాలెం-1,2, పనిచేస్తున్నాయి. మిగతా ప్రాంతాల్లో రిపేర్లకు గత పదేళ్ల నుంచి పాలకులు నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడివక్కడ చతికిలపడ్డాయి. 2016లో తెలుగుదేశం ప్రభుత్వం ఈ వ్యవస్థ బతికించడానికి కొంత ప్రయత్నం చేసింది. కొత్త ఎత్తిపోతల పథకాలను కూడా ప్రతిపాదించింది. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వీటి విషయం పూర్తిగా పక్కన పెట్టేసింది. రైతుల చొరవ వల్ల నామమాత్రంగా కొన్ని ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపినప్పటికీ మొల్లేరు- గోవిందపురం- మల్లవరం స్కీమ్ పనులు ఇంతవరకు చేపట్టలేదు. ఇది కొత్త స్కీమ్. గతంలో 22 శాతం పని జరిగి ఆగింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో పది చిన్నఎత్తిపోతల పథకాలు ఉండగా, ఇవి పాక్షికంగా పనిచేస్తున్నాయి. అందులో కొవ్వూరు నియోజకవర్గంలో కుమారదేవం, బ్రాహ్మణగూడెం, చాగల్లు, వేగేశ్వరపురం, పైడిమెట్ట-1, నిడదవోలు స్కీమ్‌లు ఉండగా అనపర్తిలో పి.బి.దేవం-1,2, కాపవరం, రాజానగరం నియోజకవర్గంలోని కాటవరం ఉన్నాయి. ఇక్కడ మొత్తం 23,745 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లకు రూ.4815.50 లక్షలు. నిర్వహణకు రూ.14745 లక్షలు. మొత్తం రూ.195 కోట్ల 60 లక్షల 50 వేలతో అంచనాలు పంపించారు. కాకినాడ జిల్లాలో అత్యధికంగా 14 స్కీమ్‌లు ఉన్నాయి. వాటిలో పెద్దాపురం నియోజకవర్గంలోని వేట్లపాలెం, కట్టమూరు, కట్టమూరు మినీ, పెద్దాపురం-1, పెద్దాపురం-2, జి.మేడపాడు, పెదబ్రహ్మదేవం-3, కాకినాడ రూరల్‌లో వేములవాడ-2, పెద్దపురపాడు, గొర్రిపూడి, వేములవాడ- అనపర్తి నియోజకవర్గం పరిధిలోని పెదపూడి, దోమాడ, జగ్గంపేట నియోజకవర్గంలోని సోమవరం పథకాలున్నాయి. ఇక్కడ 13,710 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.122 కోట్ల 25 లక్షల 32 వేలు అంచనా వేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 పథకాలు ఉన్నాయి. అవి రాజోలు నియోజవర్గంలోని చింతలమోరి, కొత్తపేట నియోజకవర్గంలోని వసంతవాడ, ఉచ్చిలి పథకాలు. ఇక్కడ మొత్తం 4,970 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి రిపేర్లు, నిర్వహణకు రూ.34 కోట్ల 8 లక్షల 37 వేలతో అంచనాలు సిద్ధంచేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పల్లిపాలెం-1,2 పథకాల్లో 927 ఎకరాల ఆయకట్టు ఉంది. రిపేర్లు, మెయింటెనెన్స్ కోసం రూ.3 కోట్ల 48 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు.

● 49 స్కీమ్‌లు.. రూ.600 కోట్లు

తెలంగాణలో కాకతీయ మిషన్ మాదిరిగా ఓ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థకు మరమ్మతులు, నిర్వహణ బాధ్యత అప్పగించే ఆలోచన ప్రభుత్వం వద్ద ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే వీటి మరమ్మతులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మొత్తం ఎత్తిపోతల పథకాలను వదిలేసి,మెట్ట ప్రాంతంలోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులతోపాటు ఐదేళ్లపాటు నిర్వహణ చేయడానికి ఓ కార్పొరేట్ సంస్థకు అప్పగించే విధంగా ప్రతిపాదనలు సిద్ధచేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 49 ఎత్తిపోతల పథకాలకు మొత్తం రూ.600 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు.

కా'పాడి'కొనేలా!



- పశువులకూ వసతిగృహాలు
- కూటమి సర్కారు కొత్త ప్రతిపాదన
- నియోజకవర్గానికి ఒకటి మంజూరు
- కాకినాడ జిల్లాలో స్థలాల కోసం వెతుకులాట

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమపైనా కూటమి సర్కారు దృష్టిసారించింది. పశుసంరక్షణకు పెద్దపీట వేసేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. పాడిని అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా కూటమి ప్రభుత్వం పశు వసతిగృహాలు(యానిమల్ హాస్టల్స్) పేరిట మెగా గోకులాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇప్పటివరకు ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి రైతుల సొంత స్థలాల్లో మినీ గోకులాలు మంజూరు చేసింది. రైతుల అవసరం మేరకు నిర్మాణాలు చేపట్టారు. ఇందుకు జాతీయ ఉపాధి పథకం నిధులు కేటాయించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థలాలు లేని పాడిరైతులకు ఉపయోగపడేలా పశువసతిగృహాలు ఏర్పాటు చేయనుంది. స్థలం లేని రైతులు తమ పశువులను వసతి గృహాల్లో ఉంచి వాటి పోషణ చూసుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేశారు. తక్కువ కాలంలోనే వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం చూస్తోంది.

ఒక్కో వసతిగృహంలో 30పశువులు

జిల్లాలో 80వేలకుపైగా గోవులు, రెండు లక్షల వరకు గేదెలు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో 30పశువులు ఉండేలా పశుసంవర్ధక శాఖ అధికారులు వీటిని ఏర్పాటు చేయనున్నారు.వసతిగృహ నిర్మాణానికి ఐదెకరాల స్థలం అవసరం. ప్రభుత్వ భూములేమైనా ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో రెవెన్యూఅధికారులు గుర్తించి పశుసంవర్ధకశాఖకు అప్పగించనున్నారు. ప్రభుత్వ భూమిలేని పరిస్థితిలో ప్రైవేటు భూములను ఐదేళ్లపాటు లీజుకు తీసుకోనున్నారు. ఎకరాస్థలంలో షెడ్డుతోపాటు పశువుల మేత దాణా నిల్వ ఉంచేందుకు గదులు నిర్మించనున్నారు. ఉపాధి హామీ పథకం నుంచి రూ.పది లక్షల నిధులు కేటాయించనున్నారు. జిల్లాలో వీటిఏర్పాటు బాధ్యత డ్వామా పీడీకి అప్పగించారు. జిల్లాలో ప్రభుత్వ స్థలాలు పెద్దగా లేవని, ఉన్న వాటిని గతప్రభుత్వం ఇళ్ల స్థలాలకు కేటాయించిందని, పశు వసతిగృహాల ఏర్పాటు ఎలా అనే ఆలోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది.

నిర్వాహకులే చూసుకునేలా..


పశువసతిగృహాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం స్వయం సహాయక, రైతు సంఘాలు, సొసైటీలు, ఎఫ్‌పీవో సంస్థలకు అప్పగించనున్నారు. గ్రామాల్లో ఆసక్తిఉన్నవారు తమ పశువులను అక్కడికి తరలిస్తే వాటికి దాణా, గడ్డి, నీరు.. అన్నీ నిర్వాహకులే చూసుకుంటారు. ఉదయం, సాయంత్రం యజమానులు వెళితే నిర్వాహకులే పాలు పితికి అప్పగిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహణకు అయ్యే ఖర్చు, కూలీలు, ఇతర ఖర్చులు లెక్కించి, గోబర్ గ్యాస్, సేంద్రియ ఎరువు విక్రయాలతో జమ చేస్తారు. అదనపు ఖర్చులు ఉంటే యజమానులు చెల్లించాల్సి ఉంటుంది.

కాకినాడలో వందేమాతరం మార్గ్‌ని ప్రతిష్ట చేసి..
దేశభక్తిని చాటుకునే అవకాశం కల్పించారు

- రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబుకు రుణపడి ఉంటాను
- పార్లమెంట్‌లో రాజ్యసభ బీజేపీ ఎంపీ రాధా మోహన్‌దాస్ అగర్వాల్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో వందేమాతరం మార్గ్‌ను ప్రతిష్ట చేసి దేశభక్తిని చాటుకునే అవకాశం కల్పించారని, దీనికి ఎంపీ సానా సతీశ్‌బాబుకు రుణపడి ఉంటానని బీజేపీ రాజ్యసభ ఎంపీ రాధామోహన్‌దాస్ అగర్వాల్ అన్నారు. ఈ మేరకు రాజ్యసభలో మంగళవారం ఆయన ప్రసంగిస్తూ తాను వందేమాతరం 150ఏళ్ల సంబరాలకు కాకినాడ వెళ్లినప్పుడు అక్కడ గాంధీపార్కు వద్ద వందేమాతరంమార్గ్‌ని నామకరణం చేసి ప్రారంభించామని గుర్తు చేశారు. అప్పుడు తనకు చేదు చరిత్ర తెలిసిందన్నారు. కాకినాడలో 1923లో జరిగిన అఖిల భారత్ కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అప్పటి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మౌలానా మహ్మద్ అలీ వందేమాతరం గేయాన్ని ఆలపించకుండా మతాన్ని అంటకట్టి ముస్లింల వ్యతిరేకంగా చిత్రీకరించి ఆ సభ నుంచి ఆయన వాకౌట్ చేశారన్నారు. మత విభేదాన్ని రేపిన ఆ సంఘటనతో 100ఏళ్లుగా కాకినాడలో ఆ వీధిని మౌలానా అలీ పేరుతో పిలిచారని, ఇది సరిదిద్దుకోవాల్సిన చారిత్రక తప్పిదమని టీడీపీ ఎంపీ సానా సతీశ్‌బాబు గుర్తించి అక్కడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి దేశ విభజనకు కారణమైన మహ్మద్ అలీ పేరును తొలగించి వందేమాతరం గేయ గౌరవార్థం ఆ వీధికి వందేమాతరం మార్గ్‌గా నామకరణం చేసే అవకాశం తనకు ఇచ్చారన్నారు. ఇలా దేశభక్తిని చాటుకునేలా తనకు తోడ్పాటును అందించిన ఎంపీ సానా సతీశ్‌బాబుకు తాను రుణపడి ఉంటానని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

జేసీని కలిసిన ఏపీ రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు



జేసీని కలిసిన జిల్లా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ ప్రతినిధులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌ను మంగళవారం కాకినాడ జిల్లా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వభరత్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన పనులు అన్నీ సకాలంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు పితాని త్రినాథ్, కార్యదర్శి సాధనాల రామ్మోహన్‌రావు, ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి డీబీఏ భైనులు, తహసీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, జితేంద్ర, కుమారి, దుర్గాప్రసాద్, నరేశ్, ఇతర రెవెన్యూ సిబ్బంది, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

లక్షలు పోసి కొన్నారు..తుప్పల్లో వదిలేశారు!



నడకుదురు ఏఎంసీ ఆవరణలో తుప్పుపట్టిపోతున్న డీసిల్టింగ్ మిషన్ ట్రాలీలు

కరప,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కరప మండలం నడకుదురు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో చెట్ల కింద లక్షలు విలువ చేసే ఈ డీసిల్టింగ్ మిషన్ ట్రాలీలు ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. డ్రైన్‌ల్లో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను హైడ్రాలిక్ బకెట్‌తో బయటకు తీసి ట్రాలీలో తరలించేందుకు వీలుగా ఈ మిషన్ అమరిక ఉంటుంది. అత్యవసర సమయాల్లో ముంపునీటిని మళ్లించేందుకు, కచ్చా డ్రైన్‌లు తవ్వేందుకు కూడా ఇవి ఉపయోగపడతాయి.ఈ డీసిల్టింగ్ మిషన్ ట్రాలీలు వినియోగిస్తే పారిశుధ్య కార్మికుల లోటును భర్తీచేయడంతోపాటు ఉన్నవారిపై పనిభారం తగ్గుతుంది. పదేళ్లుగా దాదాపు 20మిషన్లు నడకుదురు ఏఎంసీ ఆవరణలో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టుకుపోయాయి. వీటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరయ్యిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ డీసిల్టింగ్ మిషన్ ట్రాలీలు తమకు సంబంధం లేవని, ఎస్సీ కార్పొరేషన్‌కు చెందినవని మండల అధికారి ఒకరిని సంప్రదించగా బదులిచ్చారు.

టెట్ సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి

- డీఆర్వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి ఈనెల 21వతేదీ వరకు టీచర్ ఎలిజిబుల్ టెస్ట్(టెట్) సజావుగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డీఆర్వో వెంకట్రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన టెట్ పరీక్ష నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ, రెవెన్యూ, వైద్యఆరోగ్యం, పోలీసు, విద్యుత్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10 నుంచి 21వతేదీ వరకు జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల్లో 9,659మంది అభ్యర్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఈ టెట్ పరీక్ష జరుగుతుందన్నారు. కాకినాడ డివిజన్‌లో రెండు, పెద్దాపురం డివిజన్‌లో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ పరీక్ష నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 గంటలలోపు, మధ్యాహ్నం 1.30 గంటలలోపు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఫొటో గుర్తింపునకు ఒరిజినల్ ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో హాజరుకావాలన్నారు. సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి రమేశ్, అదనపు కమిషనర్ సుధాకర్, ఎంహెచ్‌వో పృథ్వీ చరణ్ పాల్గొన్నారు.

భిక్షాటన, ట్రాన్స్‌జెండర్లను వారి వృత్తి నుంచి
బయటకు తీసుకురావాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపాలిటీల్లో భిక్షాటనం, ట్రాన్స్‌జెండర్స్‌లను వారి వృత్తుల నుంచి బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన పునరావాసం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి అవకాశాలపై దృష్టిపెట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. వారికి సమగ్ర పునరావాసం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవనోపాధి సంస్థ కోసం మార్జినలైజ్డ్ ఇండివిజువల్ సపోర్ట్ పథకంపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో భిక్షాటనం, ట్రాన్స్‌జెండర్స్‌కు పునరావాసం కల్పించడానికి ఈ పథకం అమలు చేస్తున్నారన్నారు. జిల్లాలో ఈ పథకాన్ని సమగ్రంగా అమలు చేయడానికి బాధితులను గుర్తించి వారికి సరైన పునరావాసం, సుస్థిర జీవనోపాధికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశానికి హాజరైన న్యూఢిల్లీకి చెందిన రోజవనం ట్రస్ట్ సీఈవో ఎడ్విన్ ఆంటోని కార్యక్రమం అమలు, లబ్ధిదారుల శ్రేయస్సు, సేవల విస్తరణ, అవగాహన కార్యక్రమాల బలోపేతం వంటి అంశాలపై వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ శోభారాణి, ఏడీసీ సుధాకర్, మెప్మా పీడీ ప్రియంవద, లక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి అనుమతివ్వొద్దని నిరసన

- ధర్మవరం పంచాయతీ కార్యాలయం మూసివేత
- కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది నిర్బంధం

ప్రత్తిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో హైస్కూల్ సమీపంలోని వైఎస్సార్ కాలనీలో చర్చి నిర్మాణానికి పంచాయతీ అధికారులు అనుమతివ్వొద్దంటూ హిందూ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. ధర్మవరంలో జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో నూతనంగా వైఎస్సార్ కాలనీ ఏర్పాటైంది. ఈ కాలనీలో ఒక లబ్ధిదారుడి గృహాన్ని రాజమహేంద్రవరానికి చెందిన ఒక పాస్టర్ కొనుగోలు చేసి చర్చి నిర్మిస్తున్నారని, ఆ కాలనీవాసులతోపాటు హిందూ సంఘాల నాయకులు కర్రి ధర్మరాజు, రెడ్డి శేఖర్, రామకుర్తి రాజబాబు పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలిపారు. కార్యాలయంలోని కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాలరావును చర్చికి అనుమతులు ఇవ్వవద్దంటూ వారు భీష్మించారు. కార్యదర్శిని, సచివాలయ సిబ్బందిని లోపలఉంచి తలుపులు మూసివేశారు. సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం, పోలీసులు ధర్మవరం అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. కార్యాలయ తలుపులు తీయించి సిబ్బందిని బయటకు తీసుకొచ్చారు. తనకు గ్రామానికి చెందిన పసగడుగుల దుర్గారావు హైస్కూల్ సమీప కాలనీలో చర్చి నిర్మాణం ఆపాలంటూ ఆర్‌టీఏ కింద ఫిర్యాదు ఇచ్చారని, దానికి రసీదు కూడా ఇచ్చామని, తక్షణ చర్యలు తీసుకోకపోతే ఇక్కడినుంచి కదిలేది లేదని పలువురు గ్రామస్తులు తమ విధులకు ఆటంకం కలిగించారని గ్రామ కార్యదర్శి వేణుగోపాలరావు తెలిపారు.



పరీక్షల సమయం దగ్గరపడుతోంది. పదో తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా విద్యా శాఖ వంద రోజుల ప్రణాళికతో వారిని సంసిద్ధం చేస్తోంది. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడనున్నారు. కేంద్ర మానవవనరుల శాఖ ఏటా 'పరీక్షా పే' చర్చ నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి?, విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని ఎలా అధిగమించాలి? పరీక్షల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి వంటి విషయాలపై ఈ 'పరీక్షా పే' చర్చ జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతుల విద్యార్థులు అర్హులు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడతారు. వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు.

హలో పీఎం జీ...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పరీక్షా పే చర్చ 2018 ఫిబ్రవరి 16న ఢిల్లీలో ప్రారంభమైంది. అప్పట్లో తాల్కతోరా స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు నేరుగా ప్రధాని మోదీతో సంభాషించారు. ఇప్పుడు కూడా విద్యార్థులు తమ ప్రశ్నలను ప్రధాన మంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాలలోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలకు కూడా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అవకాశం కల్పించింది. ప్రస్తుతం తొమ్మిదో ఎడిషన్‌కు సన్నద్ధమవుతోంది.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 'పరీక్షా పే' చర్చ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు https://innovateindia.mygov.in క్లిక్ చేయాలి. ఎంటర్ కాగానే క్లిక్ ఏజ్ స్టూడెంట్, టీచర్, పేరెంట్స్ అనే లాగిన్స్ కనిపిస్తాయి. వాటిలోకి ఎంటర్ కాగానే మీ మొబైల్ నెంబరు లేదా జీ-మెయిల్ ఖాతాను పూర్తిచేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. ఓటీపీ రాగానే మళ్లీ లాగిన్ చేయాలి. నేరుగా ఫోను నంబరు, జీ-మెయిల్ లేని స్టూడెంట్స్ టీచర్స్ లాగిన్ ద్వారా ఎంటర్ కావొచ్చు. ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేయాలి. తర్వాత థీమ్‌ను ఎంచుకుని 500 అక్షరాలలోపు వివరించాలి. అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరీక్షా పే చర్చలో పాల్గొనేలా డీవైఈవోలు, ఎంఈవోలు కృషి చేయాలి. చర్చకు ఎంపికైన సుమారు రెండువేల మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా పీపీసీ కిట్లు అందజేయనున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 11 తుది గడువు.

పరీక్షా పే చర్చలో పాల్గొనే విద్యార్థులు ఎవరైతే మంచి ప్రశ్నలు వేస్తారో వారిని అర్హులుగా నిర్ణయిస్తారు. విజేతలు నేరుగా ప్రధాని మోదీని కలిసే అవకాశం ఉంటుంది. ప్రతి విజేతకు ప్రత్యేక కిట్, ప్రత్యేకంగా రూపొందించిన ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రధానమంత్రి ఆటోగ్రాఫ్, ఫొటోతో కూడిన డిజిటల్ సావనీర్ కూడా ఇస్తారు.





- విద్యార్థులకు ప్రధాని మోదీతో మాట్లాడే అవకాశం
- 'పరీక్షా పే' చర్చ పేరుతో త్వరలో కార్యక్రమ నిర్వహణ
- ఈ నెల ఒకటిన మొదలైన ఆన్‌లైన్ నమోదు
- జనవరి 11తో ముగియనున్న గడువు



చక్కని అవకాశం

పి.రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా



ప్రధాని నరేంద్ర మోదీతో విద్యార్థులు మాట్లాడే అరుదైన కార్యక్రమమిది. పరీక్షా పే చర్చలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. 6-12 తరగతుల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఇది చక్కని అవకాశం. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా కృషి చేయాలి.

క్రీడా సంరంభం

- కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నేటి నుంచి సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ టోర్నమెంటు
- నాలుగు పూల్స్‌గా విభజన
- కాకినాడ జిల్లాలో మూడుచోట్ల ఆరు కోర్టుల్లో నిర్వహణ
- ఆరు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 138 జట్లు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్న ప్రభుత్వ విప్ గణబాబు


జేఎన్టీయూ మైదానంలో ముస్తాబవుతున్న వేదిక

జేఎన్టీయూకే, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయూ) న్యూఢిల్లీ సహకారంతో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ పోటీలను ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నమెంటులో సుమారు 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. నాలుగు పూల్స్‌గా విభజించామన్నారు. పూల్ ఎ, బి-జేఎన్టీయూకే మైదానంలో, పూల్ సి-అచ్చంపేటలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లో, పూల్ డి-సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతాయి. ఆరు రాష్ట్రాలకు చెందిన 1,960 మంది క్రీడాకారులు, 300 మంది కోచ్‌లు, మేనేజర్లు, 60 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు అఖిల భారత స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయి. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వాలీబాల్ టోర్నమెంటును ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే, ఏపీ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు పి.గణవెంకట రెడ్డినాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారు. విశిష్ట అతిథులుగా అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు పి.వెంకటరమణ, ఏఐయూ పరిశీలకుడు డాక్టర్ ఈ.త్రిమూర్తులు, గౌరవ అతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ పాల్గొంటారు.


వివరాలు వెల్లడిస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

విజేత, రన్నరప్, 3, 4 స్థానాల్లో నిలిచే జట్లకు బహుమతులు అందజేస్తారు. లీగ్ మ్యాచ్‌ల్లో అర్హత సాధించిన జట్లకు జేఎన్టీయూ మైదానంలో పోటీలు నిర్వహిస్తారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో జరిగే అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొంటాయని శ్యామ్‌కుమార్ తెలిపారు.

వాలీబాల్ టోర్నమెంటుకు జేఎన్టీయూకే వీసీ అధ్యక్షత వహించనుండగా డైరెక్టర్లు కృష్ణమోహన్, రాము కార్యనిర్వాహక కమిటీ అధికారులుగా వ్యవహరిస్తారని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, టోర్నమెంటు కన్వీనర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ జీపీ రాజు వ్యవహరిస్తున్నారు.

● ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలకు చెందిన 138 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. వాలీబాల్ మ్యాచ్‌లు నాలుగు రోజుల పాటు నాలుగు కోర్టుల్లో జరుగుతాయి. పోటీలు ఉదయం ఆరు గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయి. జేఎన్టీయూకే మైదానంలోని ఫ్లడ్‌లైట్ కోర్టులు 1, 2, రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ క్యాంపస్‌లోని కోర్టులు 3, 4, సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలోని కోర్టులు 5, 6ల్లో మ్యాచ్‌లు జరుగుతాయి.


టోర్నీలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు




కాకినాడ జేఎన్టీయూ మైదానంలో సిద్ధం చేసిన వాలీబాల్ కోర్టు, క్రీడాభిమానులు కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటుచేసిన గ్యాలరీ

గ్రామీణ భారత్ ఉన్నతికి పీఎంజీఎస్‌వై దోహదం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

- కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్
- ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన 25 వసంతాల వేడుకలు

జేఎన్టీయూకే, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి గ్రామీణ భారత్ ఉన్నతికి ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన(పీఎంజీఎస్‌వై) ఎంతగానో ఉపయోగపడిందని కాకినాడ కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్ అన్నారు.కాకినాడ జేఎన్టీయూ అలూమ్ని ఆడిటోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ జేఎన్టీయూ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించే సాంకేతిక సెమినార్ మంగళవారం ప్రారంభమైంది. పీఎంజీఎస్‌వై ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తు న్న ఈ సెమినార్‌ను కలెక్టర్‌తోపాటు జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, పీఆర్ చీఫ్ ఇంజనీర్ బి.బాలునాయక్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రారంభించిన రోడ్లను, ఇతర ప్రాజెక్టులను ఇప్పుడు తిరిగి పరిశీలించాలన్నారు.వీసీ ప్రసాద్ మాట్లాడుతూ తాను వరంగల్ ఆర్ఈసీగా ఉండగా రాష్ట్ర సాంకేతిక ఏజెన్సీ ద్వారా వేల కిలోమీటర్లమేర గ్రామీణరోడ్లకు సాంకేతిక సహకారం అందించా మన్నారు. బాలునాయక్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి దేశ ప్రధాని వాజ్‌పేయి పుట్టినరోజు సందర్భంగా పీఎంజీఎస్‌వై ప్రారంభమైందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈలు ఏవీఎస్ శ్రీనివాస్, పి.రామకృష్ణ, బాలకృష్ణ, పృథ్వీరాజ్, ఏపీపీఆర్డీ ఇంజనీర్లసంఘ సభ్యులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పీసా చట్టంపై శిక్షణ

సామర్లకోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టంపై శిక్షణ తరగతులను కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 80మంది ఎంపీడీవోలు హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ మాట్లాడు తూ షెడ్యూల్డు ప్రాంతాల్లో పరిపాలన మరింత మెరుగుపడేలా శిక్షణను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు.ఎంపీడీవో సుశీల, ఫ్యాకల్టీ సభ్యులు చిన్నబ్బులు, నీహారిక, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కేశవస్వామి ఆలయంలో పవిత్రోత్సవ పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు మంగళవారం గోపూజ, గోప్రదక్షిణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, స్వామివారికి సప్నపనం, అకల్మష హోమాన్ని వేద పండితులు నిర్వహించారు. మంగళవాయిద్యాలతో పుట్టమట్టిని తీసుకొచ్చారు. యాగశాలలో అంకురార్పణ, వాస్తుపూజ, శాంతిహోమం నిర్వహించారు.ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు,ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వన్ నేషన్-వన్ పోర్ట్ ప్రోసెస్ అమలుతో
పోర్టు రంగంలో భారీ సంస్కరణలు

రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్‌బాబు



కాకినాడ సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వన్ నేషన్ వన్ పోర్ట్ ప్రోసెస్(ఓఎన్ఓపీ) అమ లుతో పోర్టు రంగంలో భారీ సంస్కరణలు జరగనున్నాయని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. ఈ అంశంపై మంగళవారం రాజ్యసభలో ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర పో ర్టులు, షిప్పింగ్, జల మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ స్పందించారు. దేశవ్యాప్తంగా పోర్టుల పనితీరు, డిజిటల్ వ్యవస్థలు, నియంత్రణ ప్రక్రియలను ఏకరీతిలో అమలు చేయడమే ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఓఎన్ఓపీ అభివృద్ధి, అమలుపై ఆయన స్పష్టతనిచ్చారు.ఈ చర్యలతో అన్ని పోర్టుల్లో సమాన ప్రామాణీకరణను అందించడంతో పాటు లాజిస్టిక్స్ రంగంలో పారదర్శకతను పెంచుతాయన్నారు. ముఖ్యంగా నేషనల్ లాజిస్టిక్స్ పోర్టల్(సాగర్ సేతు)ను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. అన్ని పోర్టుల్లో షిప్పింగ్ సంబంధిత సమాచారాన్ని ఎలక్ట్రానిక్స్‌గా సజావుగా సమర్పించడం, ప్రాసెసింగ్ చేయడం కోసం ఈ వేదికను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఈ వేదికపై కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ వంటి కీలక విభాగాలను ఒకే చోట అనుసంధానిస్తామని చెప్పారు.ఈ సంస్కరణలు పారదర్శకంగా, సమానంగా అమలవుతాయని, దేశంలోని ప్రతి పోర్టుకు ఆంధ్రప్రదేశ్ పోర్టులను కలుపుతూ ఈ ఫ్రేమ్ వర్క్ కొనసాగుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. దీనిపై ఎంపీ సతీష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ విధానం వల్ల పోర్టు మౌలిక వసతుల్లో, డిజిటల్ సేవల్లో, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలో ఏకరూపత నెలకొని రాష్ట్ర పోర్టులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

మడ అడవులతో మానవాళి
మనుగడకు రక్షణ

కోరింగ ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్


మడ అడవుల విశిష్టతను వివరిస్తున్న రేంజర్ వరప్రసాద్

తాళ్లరేవు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు మడ అడవులు రక్షణ గోడలా నిలుస్తున్నాయని కోరింగ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని కోరింగ అభయారణ్యాన్ని రాజమహేంద్రవరం అటవీ శాఖలో శిక్షణ పొందుతున్న 12, 13 బ్యాచ్‌ల ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవో ట్రైనీలు సందర్శించారు. వారికి మడ అడవుల విశిష్టత, వన్యప్రాణుల సంరక్షణ, సముద్ర తాబేళ్లు, సీబీఈటీ ప్రాముఖ్యతలను ఎఫ్‌బీవో మహేష్ వివరించారు. కార్యక్రమంలో అటవీ అకాడమీ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి, సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరామారావు, ఎఫ్‌బీవోలు మహేష్, డి.మహేష్‌బాబు, సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయ చైర్మన్‌గా వెంకట్రాజు



ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజు నియమితులయ్యారు. ఆలయానికి 17 మంది సభ్యులతో పాలక మండలిని నియమిస్తూ దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సిఫార్సు మేరకు ఆత్రేయపురం క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వెంకట్రాజును చైర్మన్‌గా నియమించారు. నియోజకవర్గానికి చెందిన 10 మంది ధర్మకర్తలను ప్రభుత్వం నియమించగా మరో ఏడుగురిని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారితో పాటు తెలంగాణాకు చెందిన ఓ వ్యక్తికి స్థానం కల్పించారు. ధర్మకర్తలుగా చలుమూరి రాంబాబు,గంగవరపు పద్మావతి,కాసా చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాసరావు, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరరావు, సరెళ్ళ సరిత, యేపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, యల్లమిల్లి చంద్రకుమారి,కొండపల్లి రామచంద్రరావు, శిష్టా సూర్యకుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మి, గోశాల అప్పలనర్స, అర్చక ఎక్స్‌అఫీషియోగా వాడపల్లి సుందర శేషావతారం నియమితులయ్యారు. నూతన పాలక మండలి త్వరలోనే కొలువుదీరనుంది.

డెల్టా కాలువలు, డ్రెయిన్లపై లైడార్ సర్వే

మే నెలలోపు రిపోర్టు.. రూ.13.4 కోట్లతో ఐఐసీటీతో ఒప్పందం: మంత్రి నిమ్మల

రాజమహేంద్రవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డెల్టా పంటను ముంపు బారి నుంచి తప్పించే ప్రయత్నాలను ప్రభుత్వం వెతకడం మొదలు పెట్టింది. కాలువల్లో పూడిక, డ్రెయిన్లు సరిగ్గా లేకపోవడం వల్లే ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఏటా పంట ముంపునకు గురవుతుందని ఆలోచనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో మంగళవారం ఇరిగేషన్ అధికారుల సమీక్ష జరిగింది.ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, డెల్టా సీఈ శేషబాబు, ఎస్ఈ గోపీనాథ్, ఏలూరు ఎస్ఈ దేవప్రసాద్, ఈఈలు తదితరులతో ఈ సమీక్ష జరిగింది. ఈ నెలలోనే సర్వే మొదలవుతుందని, ప్రధాన కాలువలు,డ్రెయిన్లలో పూడిక ఏ స్థాయిలో ఉంది. వాటి పరిస్థితి ఏంటనేది మ్యాప్‌లతో సహా ఈ సర్వే చేయనున్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలలో మొత్తం ఈ సర్వే జరుగుతుంది ఇరిగేషన్ అధికారుల సహకారంతో ఐఐసీటీ ఈ సర్వే నిర్వహించనుంది. కాగా డ్రిప్ పథకం కింద సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి మరమ్మతులకు కేటాయించిన రూ.150 కోట్లతో ఎప్పుడు పనులు మొదలపెడతారనేది సమావేశంలో నిర్ణయించలేదు. ప్రస్తుతం సర్వే పైనే ప్రధాన దృష్టి పెట్టడం గమనార్హం.

12న అక్నూ పీజీ క్యాంపస్‌లో అంతర్జాతీయ సదస్సు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో లింగ గుర్తింపులు, అధికారం, ప్రదర్శన, ప్రాతినిధ్యం వంటి సామాజిక సాంస్కృతిక అంశాలపై ఈ నెల 12న అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సంబంధిత బ్రోచర్‌ను నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంచడమే కాకుండా అంతర్జాతీయ స్థాయి ఆలోచనలను అవగాహన చేసుకునేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. పలువురు అంతర్జాతీయ నిపుణులు ప్రసంగించనున్న ఈ సదస్సును విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

'అన్నవరం' ఈవోగా వేండ్ర త్రినాథరావు

ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ



త్రినాథరావు

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం నూతన ఈవోగా వేండ్ర త్రినాథరావును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న వీర్ల సుబ్బారావు ఏడాది కాలపరిమితితో రెవెన్యూ విభాగం నుంచి డిప్యూటేషన్‌పై గతేడాది డిసెంబరు 13న బాధ్యతలు స్వీకరించారు. మరో 6నెలల పొడిగింపు కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఏడాదికాలంలో దేవస్థానం పాలనపై అనేక విమర్శలు రావడంతో బదిలీ అనివార్యమయింది. నూతన ఈవో వేండ్ర త్రినాథరావు ప్రస్తుతం రాజమండ్రి రీజినల్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండగా అన్నవరం దేవస్థానం బాధ్యతలు అప్పగించారు. గతంలో ఈయన అన్నవరం దేవస్థానంలో 2పర్యాయాలు ఈవోగా పనిచేయడం, ఈ ఏడాది కార్తీకమాసంలో ప్రత్యేక ఉత్సవాలైన గిరిప్రదక్షిణ, తదితర వాటికి ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. సౌమ్యుడిగా పేరున్న త్రినాథరావు నియామకంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ రత్నావతి కన్నుమూత

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య సంతాపం



బొండా రత్నావతి (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీ తొలి మహిళా చైర్‌పర్సన్ బొండా రత్నావతి (80) వయోభారంతో కన్నుమూశారు. తుని పట్టణంలోని సాయినగర్‌లో సోమవారం రాత్రి ఆమె తుది శ్వాస విడిచారు. టీడీపీ నుంచి గెలుపొందిన ఆమె 1987 నుంచి 1992 వరకు తుని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందించారు. టీడీపీ ఆవిర్భవించిన తొలినాళ్లలో ఆ పార్టీ నుంచి గెలుపొంది చైర్‌పర్సన్ పీఠాన్ని అధిరోహించారు. మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన పలు మార్పులు ఆమె హయాంలో తీసుకున్న నిర్ణయాలే. పట్టణ అభివృద్ధికి రత్నావతి విశేష కృషి చేశారని అప్పటి తరానికి చెందిన పలువురు తెలిపారు. రత్నావతి మృతికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య సంతాపం వ్యక్తం చేశారు.

బంధువులమని చెప్పి తీసుకెళ్లి.. బాలికపై అత్యాచారం

నిందితుడితో పాటు సహకరించిన మరో ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ముమ్మిడివరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో బంధువులమని చెప్పి బాలికను బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో ఇద్దరు అరెస్ట్ అయ్యారు. ఈ వివరాలను మంగళవారం ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ వెల్లడించారు. నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు.

అసలేం జరిగిందంటే..?

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ముమ్మిడివరం మండలం రాణేలంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వడ్డివారిపేటకు చెందిన మోకా గిరిబాబు ఈనెల 3న గురుకుల పాఠశాలకు వచ్చాడు. బాబాయిని అని చెప్పి అతడితో పాటు వరసకు మరదలు అయిన నేరేడుమిల్లి అర్చనాదేవి అలియాస్ చిన్నీ సాయంతో బాలికను ఆసుపత్రికి తీసుకెళ్తానని పాఠశాల యాజమాన్యాన్ని అనుమతి కోరారు. వారు అంగీకరించకపోవడంతో తాము రక్త బంధువులమని మరో మహిళతో చెప్పించి నమ్మబలికారు. బాలికకు ఉన్న అనారోగ్య సమస్య దృష్ట్యా వారితో బయటికి పంపించారు. వారు మోటారుసైకిల్‌పై బయలుదేరారు. అర్చనాదేవిని గిరిబాబు ముమ్మిడివరంలో వదిలి బాలికను అక్కడి నుంచి తీసుకుపోయాడు. అయితే ఆరోజు సాయంత్రానికి బాలిక తిరిగి రాకపోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారద ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం గిరిబాబు బాలికను పాఠశాల వద్దకు తిరిగి అప్పచెప్పగా యాజమాన్యం విషయాన్ని పోలీసులకు తెలియచేయడంతో గిరిబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆ బాలికను మహిళా ఎస్ఐతో విచారించగా పలు విషయాలు వెల్లడయ్యాయని డీఎస్పీ తెలిపారు.

లాడ్జికి తీసుకెళ్లి..

బాలికను గురుకుల పాఠశాల నుంచి బయటికి తీసుకువెళ్లిన గిరిబాబు ఆ రోజు తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం తీసుకెళ్లి కొంతసేపు గడిపి అక్కడి నుంచి అమలాపురంలోని శ్రీగణపతి లాడ్జికి తీసుకెళ్లి గుమస్తాగా పనిచేస్తున్న నాగవరపు వెంకటరమణ అలియాస్ బద్రికి కొంతసొమ్ములు ఆశగా చూపి గది అద్దెకు తీసుకుని ఆ రాత్రి ఆ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసినట్టు విచారణలో తేలింది. గిరిబాబు ఆ బాలిక ఇంటి పక్కనే నివాసం ఉంటున్నాడు. తల్లి గల్ఫ్‌లో ఉండడం, తండ్రి పనుల నిమిత్తం బెంగుళూరులో ఉండడంతో బాలిక నాన్నమ్మ, తాతయ్యల వద్దే ఉంటుంది. దీంతో బాలిక కుటుంబంతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి బాలికను లోబరుచుకున్నాడు. ఆమె సెలవులకు వచ్చినప్పుడు పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలికకు అనారోగ్యం దృష్ట్యా వైద్యం కోసం గిరిబాబును ఆమెతో ఆసుపత్రికి తోడుగా పంపేవారని, దీన్ని గిరిబాబు ఆసరాగా తీసుకునేవాడు. అత్యాచారానికి పాల్పడిన గిరిబాబు, అతడికి సహకరించిన నేరేడుమిల్లి అర్చనాదేవి అలియాస్ చిన్నీ, లాడ్జి గుమస్తా నాగవరపు వెంకటరమణపై పోక్సో చట్టం కింద కిడ్నాప్, అత్యాచారం కేసులు నమోదు చేసి సోమవారం సాయంత్రం ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం ముమ్మిడివరం కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారని డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్, హౌస్ టీచర్‌పై చర్యలు

గురుకుల పాఠశాలలో విద్యార్థిని అదృశ్యం.. అత్యాచారం సంఘటనపై ఆ పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారదను సస్పెండ్ చేయగా కాంట్రాక్టు బేసిక్‌పై పనిచేస్తున్న మేథమెటిక్స్ టీచరు, హౌస్ టీచరు డి.లోవకుమారిని విధుల నుంచి తొలగిస్తూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఉత్తర్వులు విడుదల చేసింది.

విద్యార్థినుల ధర్నా

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారదపై సస్పెన్షన్ ఎత్తివేయాలని, హౌస్ టీచర్ డి.లోవకుమారిని విధుల తొలగింపు నుంచి రద్దు చేయాలని కోరుతూ ఆ పాఠశాల విద్యార్థినులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారికి పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సంఘీభావం తెలిపారు. పాఠశాల నుంచి బయటకు వెళ్తున్న ప్రిన్సిపాల్‌ను వెళ్లిపోరాదంటూ అడ్డుకున్నారు. ప్రిన్సిపాల్ తమను పిల్లల్లా చూసుకుంటున్నారని, ఆమెను సస్పెండ్ చేయడం తగదని నినాదాలు చేశారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆందోళన విరమించాలని విద్యార్థులకు ఎంత నచ్చచెప్పినా ససేమిరా అన్నారు. డీసీవో వచ్చి హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సాంఘిక సంక్షేమ జిల్లా కోఆర్డినేటర్ జి.రాజకుమారి వచ్చి విద్యార్థినులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్ సస్పెన్షన్ విషయం, హౌస్ టీచర్ తొలగింపు రద్దు విషయం ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని ఎత్తివేసేలా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ధర్నా నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

తూకాల్లో తేడాలు వాస్తవమే..

చేబ్రోలులో 4 గంటల పాటు రైతుల ధర్నా

పట్టు పరిశ్రమల శాఖ అధికారులపై కేసు

ఎలక్ట్రానిక్ కాటా సీజ్



కాటాను పరిశీలిస్తున్న అధికారి సహిద్ సలీం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ప్రభుత్వ పట్టు గూళ్ల విక్రయ కేంద్రం (పట్టు మార్కెట్)లో తూకాల్లో వస్తున్న తేడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు మంగళవారం రైతులు ఆందోళన కొనసాగించారు. తేడాలు వాస్తవేమనని తేలడంతో పట్టుపరిశ్రమల శాఖ అధికారులపై కేసు నమోదు చేస్తున్నట్టు తూనికలు, కొలతలు శాఖ అధికారులు ప్రకటించారు. చేబ్రోలు పట్టు మార్కెట్‌లోని ఎలక్ట్రానిక్ కాటాలోని తూకంలో తేడాలు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు మంగళవారం 4 గంటల పాటు ధర్నా నిర్వహించారు. తూకంలో తేడాలతో మూడేళ్లుగా తాము భారీగా నష్టపోయామని, పరిహారం అందజేయాలని, బాధ్యులైన పట్టు పరిశ్రమశాఖ డిప్యూటీ డైరెక్టర్, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు కనీసం రూ.3-5లక్షల వరకు నష్టం జరిగిందని తెలిపారు. 100కిలోలకు 2.68కిలోలకు పైగా తక్కువ వచ్చిందని చెప్పారు. పట్టు పరిశ్రమశాఖల అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయి రైతులకు నష్టపోయేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను సస్పెండ్ చేసి తాము నష్టపోయిన సొమ్ములను పరిహారంగా ఇప్పించాలని డిమాండ్ చేశారు.

రైతులతో చర్చలు

పట్టు పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ గీతారాణి సెరీకల్చర్ కార్యాలయానికి చేరుకుని రైతులను చర్చలకు ఆహ్వానించారు. అయితే డీడీతో చర్చలు జరిపేందుకు రైతులు నిరాకరించారు. దీనితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు తహశీల్దారు రామ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ చేబ్రోలు చేరుకుని రైతులతో చర్చలు జరిపారు. పట్టు పరిశ్రమల శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని, మూడేళ్లుగా జరిగిన నష్టాన్ని తమకు పరిహారంగా అందజేయాలని, ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటి ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహశీల్దారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

తూకం-మోసం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సహిద్ సలీం చేబ్రోలు చేరుకుని ఎలక్ట్రానిక్ కాటాను తనిఖీ చేశారు. 20కిలోలకు అరకిలో, 50కిలోలుకు 1.340కిలోలు, 100 కిలోలకు 2.780కిలోల తేడాను గమనించినట్టు సలీం తెలిపారు. తాను నాలుగేళ్లుగా ఇదే జిల్లాలో పనిచేస్తున్నానని, తమ శాఖ రికార్డుల్లో చేబ్రోలు పట్టు మార్కెట్‌లో ఎలక్ట్రానిక్ కాటా ఉన్నట్టు లేదా సీళ్లు వేయించినట్టు గాని లేదని చెప్పారు. పట్టు పరిశ్రమల శాఖ అధికారులపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు.



పట్టు రైతులతో చర్చలు జరుపుతున్న తహశీల్దారు, ఎస్ఐ

త్రుటిలో తప్పిన ప్రమాదం!

ప్రైవేట్ స్కూలు బస్సు బోల్తా

స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడ్డ 40మంది చిన్నారులు

తీపర్రు వద్ద ఘటన





బోల్తా పడిన స్కూలు బస్సు, ప్రమాదంలో గాయపడిన మహిళ

పెరవలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రైవేటు స్కూలు బస్సు బోల్తా కొట్టగా విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా తాడిపర్రు జ్యోతి స్కూలుకు చెందిన బస్సు కానూరు అగ్రహారం ఉసులుమర్రులో విద్యార్థులను ఎక్కించుకుని తీపర్రులో పిల్లలను ఎక్కించుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో గోదావరి ఏటిగట్టుపై మలుపు తిప్పుకునేందుకు వచ్చింది. మలుపు తిప్పే క్రమంలో గోదావరి వైపు అప్రోచ్ రోడ్డు దాటి రివర్స్‌లో కొద్దిమేర దిగింది. దీంతో బ్రేకులు ఫెయిలై బస్సు ముందుకు రాకుండా వెనకకు కదిలింది. దీంతో డ్రైవర్ కొద్దిమేర స్టీరింగ్‌ను కంట్రోల్ చేసినప్పటికి అప్రోచ్ రోడ్డు సగం పైగా దూరం వెళ్లిన బస్సు అనంతరం పక్కకు తిరగబడింది. సుమారు 40మంది పిల్లలు భయంతో కేకలు వేశారు. బస్సు ముందుభాగంలోని అద్దం ఊడిపడడంతో అందులో నుంచి పిల్లలందరూ స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. ఆయాగా పనిచేస్తున్న మహిళకు కూడా గాయాలయ్యాయి. గాయాలైనవారికి స్థానికులు సపర్యలు చేశారు. సంఘటన తెలిసిన వెంటనే పిల్లల తల్లిదండ్రులు, ప్రజలు సంఘటనా స్థలానికి వచ్చారు. కొంతమందిని తణుకు ఆసుపత్రికి తీసుకెళ్లారు. తీపర్రుకు చెందిన ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కుందుల భూపతిరావు, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్ర ఘటనా స్థలంలో సహాయ సహకారాలు అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని బస్సులను తిప్పుతూ పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆందోళన చెందారు.



విద్యార్థులను ఊరడిస్తున్న స్థానికులు

మంత్రి దుర్గేష్ ఆరా

ఈ ఘటనపై మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. స్థానిక నాయకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పాఠశాల యాజమాన్యం, అధికారులతో మాట్లాడారు. గాయపడిన చిన్నారులకు తక్షణం వైద్య సదుపాయం అందించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా బస్సులు లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని స్కూలు యాజమాన్యాలను హెచ్చరించారు. పిల్లల తల్లిదండ్రులు కూడా లోపాలను గుర్తించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించారు.

తిమ్మాపురంలో ఉద్రిక్తత

భవనం ఖాళీ చేయించేందుకు భారీగా పోలీసుల మొహరింపు



పోలీసుల పహారా నడుమ ఇల్లు ఖాళీ చేయిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు నుంచి రుణం తీసుకున్న వ్యక్తులు సకాలంలో బాకీ చెల్లించకపోవడంతో సదరు స్థిరాస్తిని స్వాధీనం చేసుకునే క్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, బాకీదారులకు మధ్య ఏర్పడిన వాగ్వాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసిన సంఘటన మంగళవారం కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో జరిగింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు.. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 60 మంది పోలీసులు రంగంలోకి దిగి సదరు స్థిరాస్థి బ్యాంకుకి స్వాధీనం చేసేందుకు కృషి చేశారు. యూనియన్ బ్యాంకు అధికారులు మెయిన్ గేటుకి అంటించిన ఉత్తర్వుల మేరకు.. తిమ్మాపురం మెయిన్‌రోడ్డులో పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తికి జీ ప్లస్ త్రీ భవనం ఉంది. ఈ ఆస్తిని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఆఫ్ మెస్సర్స్ గౌతమి సురేష్ రైస్ ఇండస్ట్రీస్ ద్వారా తాకట్టు పెట్టి రుణం పొందారు. సకాలంలో రుణాన్ని వెనక్కి బ్యాంకుకి చెల్లించకపోవడంతో బ్యాంకు నిబంధనల మేరకు సదరు ఆస్థిని 28-4-2023, 30-5-2023లో ఈ వేలం పాట నిర్వ హించారు. మెస్సర్స్ సీ ప్రైడ్ మేనేజిమెంట్ అండ్ కన్సల్టింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ భవనాన్ని సుమారు రూ.1.15 కోట్లకు ఈ ఆక్షన్‌లో పాడుకుంది. 2023-24, 2024-25, 2025-26లో 12 మే 2025లో భవనం లోపల వస్తువులు, ఇతర పరికరాలు ఖాళీ చేసి భవనాన్ని అప్ప గించాలని 9 మే 2025లో హైకోర్టు ఫైనల్ తీర్పు నిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి భవనం స్వాధీనానికి బ్యాంకు అధికారులు రావడం, సదరు రుణగ్రహీతకు చెందిన వ్యక్తులు అడ్డుకోవడం జరుగుతుంది. దీంతో భవనాన్ని ఖాళీ చేయించి అప్పగించాలని ఈ వేలంలో దక్కించుకున్న కంపెనీ ఉన్నత అధికారుల ద్వారా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు సిఫారసు చేయించడంతో ఎట్టకేలకు మంగళవారం ఉదయం తహశీల్దార్ కుమారి, కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, బ్యాంకు అధికారులు తిమ్మాపురం చేరుకున్నారు. భవనంలో 3 అంతస్తుల్లో నుంచి సామాన్లు తొలగించే ప్రక్రియను అడ్డుకున్నారు. భారీగా పోలీసులు,ప్రత్యేక రిజర్వు బలగాలు చేరుకుని స్థానికులను పంపించివేశారు. సామాన్లు తొలగించేందుకు సైతం వాహనాలను రాకుండా అడ్డుకోవడంతో పోలీసులు పహారా ద్వారా సామాన్లు తొలగించి, వాటిని బ్యాంకుకి తరలించారు.

వేడుక ఇంట్లో శోకం..

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి



వీరమణి (ఫైల్)

శంఖవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేడుక జరగాల్సిన ఇంట్లో తీవ్ర శోకం అలుము కుంది. మహిళను కరెంటు తీగ రూపంలో మృత్యువు కబళించింది. బాధకరమైన ఈ ఘటన కాకినాడ జిల్లా కత్తిపూడిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనిశెట్టి వీరమణి (35) తన అక్క కుమార్తె రజస్వల వేడుకను తన ఇంట్లో చేద్దామని ఏర్పాటు చేసుకుంది. బుధవారం వేడుక చేసేందుకు అన్ని సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం వీరమణి లైట్ ఆన్ చేయగా విద్యుత్ షాక్ తగిలి విలవిలలాడింది. ఆమెను స్థానికుల సహాయంతో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలపడంతో వేడుక జరగాల్సిన ఇంట్లో తీవ్ర శోకం అలముకుంది. వీరమణికి భర్త గనిశెట్టి చినవెంకటరమణ, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి...

ఉప్పలగుప్తం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్.కొత్తపల్లిలో ఆక్వా చెరువుల వద్ద పనిచేస్తున్న చల్లపల్లి పంచాయతీ పల్లపేటకు చెందిన బత్తుల వెంకట్రావు (38) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకట ప్రసన్నలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బావిలో పడి వృద్ధుడు...

పెద్దాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో పడి వృద్ధుడు మృతిచెందిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో మంగళవారం జరిగింది. గ్రామంలో కిత్తయ్య చెరువు సమీపంలో ఉన్న బావి వద్దకు బహిర్భూమికి కావూరి బీమయ్య (75) వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడిపోయాడు. గత 3 రోజుల నుంచి బీమయ్య కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బావిలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేశారు.

కాకినాడలో పట్టపగలు హత్య

చెప్పులు కుట్టుకునే కార్మికుడిని చంపి పరారైన ఆటోడ్రైవర్

పట్టుకున్న పోలీసులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెప్పులు కుట్టుకునే చిరు కార్మికుడిని ఆటో డ్రైవర్ చేసిన సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కీర్తి సత్యన్నారాయణ (45) వ్యక్తిగత కారణాలతో భార్య, బిడ్డలను వదిలివేసి 10 ఏళ్ల క్రితం కాకినాడ వచ్చేశాడు. స్థానిక రేచర్లపేటకు చెందిన రాళ్ళ మేరీ అనే మహిళతో అతడికి పరిచయం ఏర్పడి అదికాస్తా సహజీవనానికి దారితీసింది. ఈ క్రమంలో సత్యన్నారాయణ సినిమా రోడ్డులోని సంతచెరువు కూడలిలో కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే వారిద్దరూ మద్యానికి బానిస కావడంతో రోజు సాయంత్రం పూటుగా మద్యం తాగేవారు. ఈ నేపథ్యంలో సత్యన్నారాయణ సోమవారం రాత్రి మద్యం తాగి దుమ్ములపేటకు చెందిన ఆటో డ్రైవర్ అత్తిలి రంగాను అతడి తల్లిని దూషిస్తూ కారణం లేకుండా వాగ్వివాదానికి దిగా డు. అనంతరం గొడవ సద్దుమణిగింది. అయితే మంగళవారం మధ్యాహ్నం సత్యన్నారాయణచెప్పులు కుట్టే పనిలో నిమగ్నమై ఉండగా ఆటో డ్రైవర్ రం గా అక్కడికి మద్యం తాగి వచ్చి తన తల్లిని ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. దానికి సత్యన్నారాయణఆ విషయం గుర్తులేదని చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రంగా కోపోద్రిక్తుడై చెప్పులుకుట్టేందుకు వినియోగించే పదునైన రంపిని సత్యన్నారాయణ గుండెల్లో దింపి అక్కడ నుంచి పరారయ్యాడు. సత్యన్నారాయణ తీవ్ర రక్తస్రావంతో పరిగెడుతూ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కుప్పకూలిపోయాడు. అది గమనించిన పోలీసులు క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్పీ జి.బిందుమాధవ్, కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్‌పాటిల్ సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీమ్ రంగంలోకి దిగి నిందితుడి వేలి ముద్రలు సేకరించింది. హత్య జరిగిన మూడు గంటల్లోనే నిందితుడు రంగాను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ కె.సత్యన్నారాయణ తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సత్యన్నారాయణ మృతదేహం

వ్యవసాయ మోటార్లలో కాపర్ వైర్ల చోరీ

ఎటపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాచగొంపల్లి, గౌరిదేవిపేట గ్రామాల్లో గోదావరి ఒడ్డున రైతులు వినియోగించే 10 హెచ్‌పీ మోటార్లలోని కాపర్ వైర్ల (త్రీకోరు)ను సోమవారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఏకకాలంలో ఈ రెండు గ్రామాల్లోని గోదావరి ఒడ్డున పంటల నీటితడుల కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న 20 మోటార్లలోని కాపర్ వైర్లను కట్ చేసుకుని వెళ్లారు. ఒక్క మోటారులో రూ.5వేల విలువైన కాపర్ వైరు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. వారం క్రితం ఇదే తరహాలో నెల్లిపాక, చోడవరం గ్రామాల్లోని గోదావరి నదీ ఒడ్డున రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లలోని కాపర్ వైర్లను కూడా చోరీ చేశారు. నెల్లిపాకలో 7 మోటార్లు, చోడవరంలోని 3 మోటార్లలోని కాపర్ వైర్లను ఎత్తుకెళ్లారు. దీంతో నెల్లిపాక రైతులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. భూపాలపట్నం గ్రామానికి చెందిన కాకర అప్పారావు ఈనెల 5న హత్యకు గురయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి కుళ్ల రాజబాబు, నాగేశ్వరరావు నిందితులుగా ఉన్నారు. రాజబాబును సోమవారం జగ్గంపేట మండలం రామవరం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగేశ్వరావు కోసం పోలీసు బృందాలు గాలించగా మంగళవారం జగ్గంపేట గ్రామ శివారున మోడల్ డిగ్రీ కళాశాల వద్ద ఉన్నట్టు గమనించి అరెస్టు చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐసతీష్‌ను డీఎస్పీ అభినందించారు.



నాగేశ్వరరావును అరెస్టు చేసిన పోలీసులు

'అయినవిల్లి' ఆదాయం రూ.46.30 లక్షలు

అయినవిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి దేవస్థానంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. 91 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.45,07,994, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.1,22,245 వెరసి మొత్తం రూ.46,30,239 ఆదాయం లభించిందని ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 219.9 గ్రాముల వెండి, 4.2 గ్రాముల బంగారం, 20 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయని ఆయన చెప్పారు.

సత్తా చాటిన తుని యువకుడు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం





సర్టిఫికెట్లతో సాయి, చిన్న కుండల తయారీ వీల్

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కాకినాడ జిల్లా తునికి చెందిన యువకుడు తిరుమలసేడి సాయి స్థానం సాధించాడు. ఇటీవల అతడు తయారుచేసిన అతి చిన్న మోటార్ వీల్ (ద స్మాలెస్ట్ మోటరైజ్డ్ పోటరీ వీల్) గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఈ మేరకు సాయికి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందింది. అతి చిన్న కుండలు తయారు చేసే మోటార్ వీల్ తయారు చేసి మరోసారి గిన్నిస్ రికార్డ్స్‌లోఅతడు స్థానం సాధించాడు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కాట్రేనికోన, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీ కొత్తపాలెనికి చెందిన మేడ సత్యం (55) సోమవారం రాత్రి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మరణించాడు. అతడి మృతదేహం మంగళవారం ఉదయం గోదావరి పాయలో తేలియాడుతుండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య నాగవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తునిలో దొంగల హల్‌చల్

ఫిజియోథెరపి సెంటర్‌లో నగదుతో పాటు పార్కు చేసిన బైక్ చోరీ

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణంలో ఎంపీపీ బొప్పన రాముకు చెందిన ఫిజియోథెరపి సెంటర్‌లో సోమవారం రాత్రి దొంగలు చొరబడ్డారు. ఆసుపత్రి గోడ దూకి లోపలికి ప్రవేశించిన ఇద్దరు రూ.30వేల నగదు అపహరించారు. అలాగే ఫిజియోథెరపి సెంటర్ సమీపంలో ఉన్న బిల్డింగ్ వద్ద పార్కు చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో తుని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

తాళ్లరేవు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజరం గ్రామంలో రాజరాజేశ్వరి రైస్‌మిల్లులో ధాన్యం కొనుగోళ్లను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. తహసీల్దారు జీఆర్ ఠాగూర్, ఆర్‌ఐ నాగేశ్వరరావు, వీఆర్వోలు రాధాకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ

కాకినాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా శేశెట్టి సత్యనారాయణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ రామారావుపేటలోని ఎస్టీయూ భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా 79వ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోతు రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా గుమ్మపు రామ్‌తేజలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30 శాతాన్ని తక్షణం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు మోర్త శ్రీనివాస్, కుసుమించి కాశీవిశ్వనాథ్, పీవీ సత్యనారాయణరాజు, యు.శ్రీను, డీవీఎస్ రాజు, వెంకటేశ్వరరావు, రాఘవ, ఎస్.అర్జున్‌కుమార్, ఎస్టీయూ సీనియర్ నాయకులు పి.సుబ్బరాజు, వెంకట్రావు, ఎం.జానీ, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


రోటరాక్ట్ యువతి క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

రోటరాక్ట్ యువతి క్లబ్ నూతన కార్యవర్గమిదే

కాకినాడ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరాక్ట్ యువతి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. వీఎస్ఎల్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, ప్రత్యేక అతిథులుగా రోటరీ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, ఆర్‌ఐసీ చైర్మన్ చిరం జీవిరెడ్డి హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. క్లబ్ అధ్యక్షురాలిగా పీఎన్‌వీ సాయిస్వరూప్, కార్యదర్శిగా డి.చాందిని, ఉపాధ్యక్షురాలిగా పి.ప్రీతి, సంయుక్త కార్యదర్శిగా వి.సీత, కోశాధికారిగా జి.వర్ష, పాటు వివిధ విభాగాల డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. వీఎస్ఎల్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.సంధ్య, కార్యదర్శి పి.కుమారస్వామి, ఉపాధ్యక్షురాలు వి.శ్రావ్య, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కోశాధికారి ఉదయచక్రవర్తి, గోవిందరాజులు, మాజేటి పవన్, రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి నల్లమిల్లి మాచారెడ్డి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు, డాక్టర్ పరశురామ్, బదిరెడ్డి వెంకన్న, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి డెయిరీ ఫారం రైతు బజార్

కాకినాడ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డెయిరీఫారం రైతు బజార్ త్వరలో అందుబాటులోకి రానుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వెల్లడించారు. మంగళవారం రెవెన్యూ కాలనీలోని కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి విచ్చేసిన ఆయన పాలకవర్గ సభ్యులతో మాట్లాడారు. కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, వైస్ చైర్‌పర్సన్ దేవి, డైరెక్టర్లు సుంకర సురేష్, బొత్సా దాసు, బుజ్జిబాబు, కార్యదర్శి బి.విజయ రామరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డెయిరీఫారం ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రైతు బజార్‌ను ఏఎంసీ చైర్మన్ బచ్చు శేఖర్, డైరెక్టర్లు పరిశీలించారు.


వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ సామాజిక సేవ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీఐఐసీ కాలనీ పార్కులో క్లబ్ కోశాధికారి కొప్పర్తి సాయికృష్ణ రూ.2లక్షల ఆర్థిక సహకారంతో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన క్రీడా పరికరాలను లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ డిస్ట్రిక్ట్-316 బి జోన్-3 గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు-రూప దంపతులు ప్రారంభించారు. పలువురు మహిళలకు కుట్టుమిషన్లు అందించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఇందుగుల ప్రసాద్‌నాయుడు, మాజీ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, ప్రాంతీయ చైర్మన్ ప్రభుదాస్, జోన్ చైర్మన్ మిరియాల రామచంద్రన్, క్లబ్ కార్యదర్శి నాగేంద్ర గాంధీ, మూర్తి, నాగిని, అడబాల రత్నప్రసాదరావు, గరికిపాటి ఓంనమశ్శివాయ పాల్గొన్నారు.


మహిళకు కుట్టు మిషన్ అందజేస్తున్న జిల్లా గవర్నర్ కోటేశ్వరరావు


టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతి

పెద్దాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. 30 ఏళ్లకు పైగా సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు టెట్‌కు సిద్ధమవ్వడం కష్టమన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు సూరిబాబు, సాయిరాం, సత్యనారాయణ, ప్రభాకరవర్మ తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం ఇస్తున్నఉపాధ్యాయులు

'చలికాలంలో గుండె జబ్బులతో ప్రమాదం'

సామర్లకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చలికాలం ప్రారంభంతో గుండె జబ్బుల ప్రమాదం గణనీయంగా పెరుగుతోందని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు, కార్డియాలజీ నిపుణులు డాక్టర్ మాతా శ్రీనివాస్, డాక్టర్ ప్రణవ్ పల్లెంపాటి, డాక్టర్ నరేష్ కూరాకుల పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా తగ్గినపుడు రక్తనాళాలు సంకోచించి రక్తపోటు పెరగడం, గుండెపై ఒత్తిడి ఎక్కువవ్వడం, హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలను రెట్టింపు చేస్తాయన్నారు. అత్యవసర హార్ట్‌కేర్ సర్వీసులు, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, రోటా, సీఆర్‌డీ వంటి అత్యాధునిక చికిత్సలు తమ హాస్పిటల్‌లో నిరంతరం అందుబాటులో ఉంటాయని చెప్పారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రణవ్, డాక్టర్ నరేష్

గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణులకు వైద్య పరీక్షలు

గొల్లప్రోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్లో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 55 మంది గర్భిణులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యాధికారిణి డాక్టర్ షారోన్ కీర్తన పరీక్షలు చేయగా హెచ్‌వీ లక్ష్మీరమణ, ఎల్‌టీ శ్రీనివాస్, ఫార్మసిస్ట్ ఎస్‌కే షర్మిల, స్టాఫ్ నర్స్ చంద్రిక సహకారం అందించారు. గర్భిణులకు పండ్లు, గ్లూకోజ్, శీతల పానీయాలను జనసేన నాయకులు బలిరెడ్డి గంగాబాబు, బస్సా చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, పర్ల రాజా, గున్నాబత్తుల రాంబాబు, పి.నాని, వీరబాబు తదితరులు అందజేశారు.

మలుపు... ప్రమాదాలకు పిలుపు


గోర్స-పండూరు రోడ్డులో రెయిలింగ్ లేని కల్వర్టు

(కొత్తపల్లి-ఆంధ్రజ్యోతి)

ఈ చిత్రంలో కనిపిస్తున్నది గోర్స-పండూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ప్రమాదకరమైన కల్వర్టు. ఇరుకైన మలుపులో ఉన్న కల్వర్టుకు రెండు దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన రెయిలింగ్ ప్రస్తుతం ఆనవాలు లేకుండా పోయింది. ఈ మార్గంలో వివిధ గ్రామాల నుంచి ప్రయాణికులు బైక్‌లు, పలు రకాల వాహనాలపై రాకపోకలు సాగిస్తారు. ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో కెరటాల ఉధృతి ఎక్కువైనప్పుడు ఈ రోడ్డుగుండానే కాకినాడ వెళ్తారు. బైక్‌లపై ప్రయాణిస్తూ రెయిలింగ్ లేని కల్వర్టుపై నుంచి కాలువలో పడి నలుగురు మృతి చెందారు. ప్రమాదకర మలుపులో రెండువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాల రాకపోకలను గుర్తించకపోవడంతో ప్రమాదాలపాలవుతున్నారు.


కొత్తపల్లి మండలం ఉప్పాడ భవిత కేంద్రంలో దివ్యాంగ బాలికకు కేక్ తినిపిస్తున్న ఎంఈవోలు వేణుగోపాల్, పైడిరాజు



పెద్దాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటలక్ష్మి

'దివ్యాంగ పిల్లలను ఆదరించాలి'

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడ నెం.1 ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు బుర్రా వేణుగోపాల్, జి.పైడిరాజు దివ్యాంగులతో కేక్ కట్ చేయించి వారికి తినిపించారు. దివ్యాంగ పిల్లలను ప్రేమాభిమానాలతో ఆదరించాలని కోరారు. వివిధ ఆటలు, పాటల పోటీల్లో విజేతలకు ఎంఈవోలు బహుమతులు అందజేశారు. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి జాన్, జనసేన నాయకులు గంటా విజయకుమార్, దివ్యాంగ పాఠశాల ఇన్‌స్ట్రక్టర్లు దేవి, లోవరాజు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగులను ఆదరించాలని, వారిపట్ల గౌరవంగా నడుచుకోవాలన్నారు. హెచ్ఎం పద్మశ్రీ, గెడ్డ పెద కాపు, తటవర్తి సత్యనారాయణ, భవానీ, దుర్గా ప్రసాద్, ఆనందరావు, అపర్ణ, భళ్లమూడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు'

పిఠాపురం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేసి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. పిఠాపురం మండలం విరవ గ్రామంలో మంగళవారం జరిగిన పొలంబడి క్షేత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉందని, దానిని అందిపుచ్చుకోవాలన్నారు. విరవను రసాయన రహిత (లేదా) సేంద్రియ వ్యవసాయ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఆదర్శ రైతులు తమ్మనబోయిన నాగేశ్వరరావు, అచ్యుతరామయ్య, కృష్ణ తదితరులను జిల్లా వ్యవసాయాధికారి సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు పి.స్వాతి, ఏవో గంగాధర్, మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శ రైతులను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయకుమార్

యండపల్లి స్కూలు వివాదం ముగిసింది

• ఎంఈవో-1 వేణుగోపాల్

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివాదం ముగిసిందని ఎంఈవో-1 బుర్రా వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులు కొట్టుకోవడంతో ఏర్పడిన వివాదాన్ని సామాజికవర్గ విభేదాలుగా సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై మంగళవారం తహసీల్దారు జి.చిన్నారావు, ఎంఈవో-1 వేణుగోపాల్, ఎంఈవో-2 జి.పైడిరాజు, కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ సమీక్షించారు. కొందరు వెనుకుండి వివాదాన్ని రాజకీయం చేయాలన్న కోణంలో ఫిర్యాదుల పరంపర కొనసాగిస్తున్న విషయంపై చర్చించారు. అనంతరం ఎంఈవో-1 వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, హెచ్ఎం, ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న అపోహలు సమసిపోయాయన్నారు. ఇందుకు కారణమైన హెచ్ఎం, ఇద్దరు టీచర్లను ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించామన్నారు. వారి స్థానాల్లో ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులను నియమించామన్నారు.

కాగా ఈ వివాదం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి చేరింది. వర్గ వైషమ్యాలను ప్రోత్సహించకూడదని ఆయన భావించారు. అదే సమయంలో ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చూడాలని జిల్లా అధికారులకు సూచించినట్టు తెలిసింది. ఫలితంగా ఒక్క రోజులో ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌తో సమస్యకు పరిష్కారం చూపి తల్లిదండ్రుల ఆగ్రహాన్ని శాంతింపజేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాల్


ఒకే వాక్యాన్ని పలు భాషల్లో మాట్లాడుతున్న విద్యార్థినుల చాందిని, హరిణి

'భాషల ఔన్నత్యాన్ని గుర్తించాలి'

సామర్లకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వివిధ భాషల్లో ఉన్న ఔన్నత్యాన్ని గుర్తించాలని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ కోరారు. భాషా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు సీహెచ్ బబిత, హరినాథ్, బేబీరాణి, వి.దుర్గాప్రసాద్ ప్రసంగించారు. విద్యార్థినులు చాందిని, హరిణి... మీరు బావున్నారా అంటూ పలు భాషల్లో మాట్లాడి ఆకట్టుకున్నారు.

విముక్తి కాలనీలో ఉచిత వైద్య శిబిరం

కాకినాడ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు వద్ద గల విముక్తి కాలనీలో అలయన్స్ క్లబ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మద్దివికాస్ అధ్యక్షతన క్లబ్ సభ్యురాలు బాలాత్రిపురసుందరి బంధువు లండన్‌లో ఉంటున్న సాయివెంకట ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన శిబిరంలో లెప్రసీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు జరిపి నెలకు సరిపడా మందులు, బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు అందజేశారు. ముఖ్య అతిథిగా అలయన్స్ 106 గవర్నర్ పెంకే గోవిందరాజు, విశిష్ట అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఇన్నర్‌వీల్ కమిటీ సభ్యుడు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ప్రసాద్ కిరణ్‌కుమార్, వనం ఉపేంద్రనాథ్, కౌశిక్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిభా పోటీల్లో విజేతలతో కాప్కో, కాకినాడ వినియోగదారుల సంఘాల ప్రతినిధులు

ప్రభుత్వ కళాశాలలో ప్రతిభా పోటీలు

పిఠాపురం. డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్ఆర్ బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాప్కో, కాకినాడ జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి హెచ్ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్థ సత్వర, సత్వర పరిష్కారం అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను కాకినాడలో విద్యాశాఖ ద్వారా నిర్వహించనున్నామని వివరించారు. విజేతలకు నగదు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. జిల్లాల్లో మొదటి స్థానాల్లో నిలిచిన వారు ఈ నెల 23న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో పిఠాపురం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు డి.మణికుమార్, ప్రిన్సిపాల్ వి.కేశవరావు, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినులకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భానుగుడి వద్ద గల అంబికా అక్వేరియం రెస్టారెంట్ మంగళవారం సామాజిక సేవా కార్యక్రమం చేపట్టింది. రాఘవ కాలేజీలో ఫిజియోథెరపీ సెకండియర్ చదువుతున్న సాయి తులసికి రూ.20వేలు, సంజీవ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న జోషికకు రూ.20వేలు నగదును యువ నాయకుడు పంతం సందీప్ అందించారు. శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్, రెస్టారెంట్ నిర్వాహకులు కోన సతీష్, ప్రశాంతి, సభ్యులు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న సందీప్

టీడీపీ కార్యకర్త సభ్యత్వం రద్దు

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడకు చెందిన చోడిపల్లి ప్రసాద్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేసినట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన చెప్పారు.



పుస్తకాల గదిలో బస్తాలు

సామర్లకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారున ఉన్న కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల తరగతి గదులను రేషన్ డీలర్ ఆక్రమించి రేషన్ బియ్యం బస్తాలను నిల్వ ఉంచినట్టు తెలిసింది. గదికి డీలర్ తాళం వేసి తమను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నాడని సిబ్బంది చెప్తున్నారు. డీలర్ అక్రమాలపై విద్యా శాఖాధికారులు, మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదంటున్నారు. తహసీల్దారు సత్వరం స్పందించి తరగతి గదిలో నిల్వ ఉంచిన బియ్యం అక్రమమా, సక్రమమా నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీప్రకాష్ సినర్జీ స్కూలు వార్షికోత్సవం

కాకినాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సురేష్‌నగర్‌లో శ్రీప్రకాష్ సినర్జీ స్కూలు 11వ వార్షికోత్సవం మంగళవారం వేడుకగా జరిగింది. చెన్నైకు చెందిన జోహో స్టార్టప్స్ గ్లోబల్ హెడ్ కుప్పు లక్ష్మీకృష్ణమూర్తి, కాకినాడ ఐఐఎఫ్‌టీ హెడ్ డాక్టర్ వి.రవీంద్రసారధి, అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఇంటర్నేషనల్ మెడిసిన్ ఎండీ డాక్టర్ సుమత వెల్లంకి, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విశ్రాంత అధికారి దొరైరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత, క్రీడలు, విద్యా ప్రావీణ్యతలను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని వారు పేర్కొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. సుమారు 500 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

గొల్లప్రోలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా గొల్లప్రోలు మండలం కొడవలి, వన్నెపూడి, తాటిపర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు గ్రామాలకు చెందిన ఎనిమిది మందికి ఆరోగ్య అవసరాల నిమిత్తం రూ.2.60 లక్షలు మంజూరయ్యాయి. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ మంగళవారం లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి చెక్కులు అందజేశారు. గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, గింజాల నాగేశ్వరరావు, కుక్కా మురళి, శీరం సత్తిబాబు, మొగలి సత్యనారాయణ, కందా సత్యనారాయణ, వెంకటరమణ, మొగిలి బుజ్జి, కందా శివ, సుంకర నాగబాబు, గోకరకొండ నారాయణ, మునికేష్ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు

సౌండ్ సిస్టం అందజేత

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మార్కెట్ ఏరియాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర పద్మశాలీ వెల్ఫేర్-డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ మంగళవారం జరిగిన కార్యక్రమంలో సౌండ్ సిస్టం అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో వీటిని అందజేసినట్టు ఆయన చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ప్రతినిధులు, దిబ్బిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ చోరీ చేసిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా

పిఠాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొబైల్ చోరీ చేసిన వ్యక్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.వెంకట అపర్ణ మంగళవారం తీర్పు చెప్పారు. పెద్దాపురం మండలం వడ్లమూరుకు చెందిన బెహరా సూర్యనారాయణమూర్తి మొబైల్ పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం వద్ద 2020 అక్టోబరులో చోరీకి గురైంది. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన పిఠాపురం మండలం విరవకు చెందిన ఎస్.శివను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో శివకు 15 రోజులు జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ శ్యామలరావు సాక్షులను ప్రవేశపెట్టగా ఏపీపీ జగదీష్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

రహదారులపై ధాన్యంరాశులు

తొండంగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ మాసూళ్లకు స్వస్తి పలికిన రైతులు యంత్రాలతో కోతలు కోసి నూర్పిడి చేస్తున్నారు. దీంతో ధాన్యంలో తేమ అధికంగా ఉంటోంది. 17 శాతం తేమ ఉంటే నాణ్యమైన ధాన్యంగా గుర్తించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో ధాన్యాన్ని రహదారులపై బరకాలు వేసి ఎండబెడుతున్నారు. ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రం సమీపంలో రహదారిపై ధాన్యంరాశులు కనిపిస్తున్నాయి.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తాడువాయిలో అన్ని వసతులు కల్పిస్తాం

● చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్


నిర్వాసితులతో మాట్లాడుతున్న పీవో, హాజరైన నిర్వాసితులు

కూనవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు తాడువాయి పునరావాస కేంద్రంలో వచ్చే ఏడాది సెప్టెంబరు కల్లా అన్ని వసతులు కల్పిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో కూనవరం పోలవరం నిర్వాసితుల గ్రామసభ జరిగింది. దీనికి హాజరైన పీవో మాట్లాడుతూ ప్రస్తుతం తాడువాయిలో పునరావాసానికి దరఖాస్తు చేసుకున్న వారికి అన్ని వసతులు కల్పిం చేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. సొంతంగా ఇల్లు కట్టుకునే వారికి మూడునెలల్లో ప్లాట్లుగా తయారుచేసి అర్హులైన నిర్వాసితులకు అప్పగిస్తామన్నారు. అలాగే ఆర్ అండ్‌ఆర్ పరిహారం కోసం ఒక బృందాన్ని సర్వే కోసం పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ధర్మేంద్ర, ఎంపీడీవో జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

18న పాడేరులో జరిగే ధర్నాలో పాల్గొనాలి

- యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గొలగాని శ్రీను పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను

రాజవొమ్మంగి డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈనెల 18న అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జరగనున్న ధర్నాలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాల్గొనాలని యూటీఎఫ్ మండలా ధ్యక్షుడు గొలగాని శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం యూటీఎఫ్ మండలశాఖ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీను మాట్లడుతూ...ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పీఆర్‌సీ కమిషన్ వెంటనే వేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను, సహ అధ్యక్షుడు జంపా రాంబాబు, సహాధ్యక్షురాలు కోడూరి లోవరాజు,జిల్లా కార్యదర్శి మిరియాల రమేష్ బాబు, మండల మహిళా కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల బ్యాంక్ ఖాతాల్లో సొమ్ములు జమ

వీఆర్‌పురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వడ్డిగూడెం గ్రామ పంచాయతీలోని వడ్డిగూడెం గ్రామ పోలవరం నిర్వాసితుల బ్యాంక్ ఖాతాల్లో ఇంటి విలువలకు సంబంధించిన నష్టపరిహారం సొమ్ములు మంగళవారం జమ అయ్యాయి. దీంతో నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై టీడీపీ మండల అధ్యక్షుడు బొర్ర నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి నిర్వాసితులకు అండగా నిలబడ్డారన్నారు. దీంతో ఖాతాల్లో ఇంటి విలువల సొమ్ములు జమ అవుతున్నాయన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎస్టీ కమిషన్ చైర్మన్


బందపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ, బందపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైరన్ చోళ్ల బొజ్జిరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో అందిస్తున్న బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలల్లో నీటి సరఫరా, టాయిలెట్స్‌ను శుభ్రత సమస్యలు తక్షమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే తరగతి గదులు, వసతి గృహాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

చైర్మన్‌ను కలిసిన నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు

అలాగే చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయాలలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, కోర్టు పరిధిలో ఉన్న అంశాలు పరిష్కరించాలని కోరుతూ వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదే రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు పండా సూర్యారావు, త్రిమూర్తులు, మనోహర్‌రెడ్డి, మడకం రాజన్నదొర, రామన్నదొర కలిసిన వారిలో ఉన్నారు.

స్క్రబ్ టైఫస్ పై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం


అడ్డతీగల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్క్రబ్ టైఫస్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. కౌన్సిలర్ నారే వాసు ఆధ్వర్యంలో జరిగింది. చింతూరు మండలం కొత్తపల్లిలో తొలి కేసు నమోదయ్యిందన్నారు. వ్యవసాయ పనులు చేసుకునేవారు, రాత్రి ప్రయాణా లు చేసేవారు, అడవిలోకి వెళ్లి కట్టెలు తీసుకునే సమయంలో ఎటువంటి పురుగు కుట్టినా, ఒంటిమీద దద్దుర్లు వచ్చినా, జర్వం, అలసట దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడ్ని సంప్రదించాలన్నారు.

జాతీయ రహదారిపై ధాన్యం ఆరబెట్టొద్దు

రాజవొమ్మంగి డిసెం బరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై ధాన్యం ఆరబెడితే చట్టపరమైన చర్యలు తప్పవని జడ్డంగి ఎస్ఐ చినబాబు హెచ్చరించారు. మంగళవారం పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయరహదారి 516ఇ పై ఆరబెట్టిన ధాన్యం వద్దకు ఎస్ఐ వెళ్లారు. రహదారిపై ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులకు వివరించారు. రోడ్డుపై ధాన్యం తీయాలన్నారు. ఈయనతోపాటు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఒడిశాలో చెలరేగిన అల్లర్లు

● ఓ వర్గం ... మరో వర్గానికి చెందిన గ్రామంపై దాడి


ఓ వర్గంపై దాడి చేసేందుకు కత్తులు, కర్రలు పట్టుకొని బయలుదేరిన మరో వర్గం

చింతూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో ఓ వర్గానికి చెందిన వారు మరో వర్గానికి చెందిన గ్రామంపై విరుచుకుపడ్డారు. దీంతో ఇళ్లు, వాహనాలు, ఇతరత్రా సామగ్రిని తగులబెట్టడంతో హింస చెలరేగింది.వివరాల్లోకి వెళితే... మల్కనగిరి జిల్లా ఎంవీ 26 అనే గ్రామంలో ఈ ఘటన రెండు రోజుల క్రితం చోటుచేసుకుంది. రకుల్‌గూడకు చెందిన ఓ వృద్ధురాలు గత కొద్దిరోజులుగా కనిపించడంలేదు. దీంతో ఆ గ్రామానికి చెందినవారు సదరు వృద్ధురాలి జాడ కోసం వెతక సాగారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆ వృద్ధురాలి మొండెం కాలువలో లభ్యమైంది. దీంతో ఆమె హత్యకు గురైనట్టు రకుల్‌గూడ వాసులు భావించారు. ఈ నేపథ్యంలో అప్పటికే హత్యకు గురైన కుటుంబానికి, ఎంవీ 26 గ్రామస్థులకు భూతగాదా నడుస్తున్నట్టు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. కాగా, ఎంవీ 26 గ్రామస్థులు తమపై జరిగిన దాడిని ఖం డిస్తూ జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమం లో ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

తునిలో ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు తనిఖీలు


తేటగుంట అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తునిలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఆయన జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తేటగుంట గ్రామంలో ఒక అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టోరూమ్‌ను పరిశీలించిన నిల్వలో వ్యత్యాసాలను గమనించి పిల్లలతో మాట్లాడారు. అమలవుతున్న మెనూ, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తునిలో పలు రేషన్ డిపోలను తనిఖీలు చేపట్టారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి పలు సూచనలు చేశారు.


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెద్దనాపల్లి ప్రభుత్వాస్పత్రిలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ నెల 9,10 తేదీల్లో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురు గర్భిణులకు వైద్య సేవలందించారు. మహిళల భద్ర, ఆరోగ్యం, ప్రసవాంతర సంరక్షణ ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు.

'భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యం'

బీజేపీ మండలాధ్యక్షుడు రాజబాబు

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే బీజేపీ లక్ష్యమని కిర్లంపూడి మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు. మంగళవారం మండలంలోని పాలెంలో ప్రతీ ఇంటా స్వదేశీ, ఇంటింటా స్వదేశీ, ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్వదేశీ వస్తువులు వాడాలని అవగాహన కల్పించి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద భారతి, అనపర్తి వెంకటేశ్వరరావు, అల్లు శివరామకృష్ణ, కంటా కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

గండేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును మంగళవారం కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు పరిశీలించారు. వంటశాలలో భోజనాలు తయారు చేసే తీరును పరిశీలించి నాణ్యమైన నిత్యవసర వస్తువులు వంటలకు ఉపయోగిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలగరెడ్డి భద్రరావు, తెలగరెడ్డి ప్రకాష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడిన 'మాదాల'


మాదాల చిత్రపటానికి వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ మాదాల నారాయణస్వామి వర్ధంతి సభను జగ్గంపేట భగత్ సింగ్ నగర్ కాలనీలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మరుకుర్తి యేసు అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్తలు సీపీఐ (ఎంఎల్) న్యూడెమో క్రసీ రాష్ట్ర నాయకులు ఎం.దుర్గాప్రసాద్, అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ప్రదీప్ నాయుడు ముఖ్య వక్తలుగా మాట్లాడారు. నారాయణస్వామి పార్లమెంటు సభ్యుడిగా, అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షుడిగా రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాడి అమరులయ్యారన్నారు. దేశంలో కమ్యూనిస్టులు నారాయణస్వామి లాగా ఉండాలని ఎంతో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సభ్యుడు గంటా బాలరాజు, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాగుల రఘువులు, కార్మిక సంఘం నాయకులు ఎం బాబురావు, గరక దుర్గారావు పాల్గొన్నారు.

వీరవరం - భూపాలపట్నం బీటీ రోడ్డు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వీరవరం నుంచి భూపాలపట్నం వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులను మంగళవారం ఎంపీపీ తోట రవి, పంచాయతీ రాజ్ డీఈ ఉమాశంకర్ పరిశీలించారు. ఎంపీపీ రవి మాట్లాడుతూ రూ.1.80కోట్లు ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఎంతో కృషి చేశారన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని అధికారులకు తెలిపారు.

మల్లేపల్లి సర్పంచ్‌గా శ్రీను


శ్రీనును అభినందిస్తున్న నాయకులు

గండేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి సర్పంచ్‌గా దొమ్మా శ్రీను మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. గత సర్పంచ్ బలరెడ్డి వరలక్ష్మి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. దీంతో ఉపసర్పంచ్‌గా ఉన్న దొమ్మా శ్రీను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానని శ్రీను అన్నారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, టీడీపీ గ్రామాధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, పోతుల దుర్గాప్రసాద్, దార్లంక నూకరాజు, తెలగరెడ్డి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే


కొత్తపల్లిలో రోడ్డుపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు/శంఖవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. ప్రత్తిపాడు, శంఖవరం మండలాలను కలిపే ఉద్దండ జగన్నాథపురం, బొండి కొత్తపల్లి గ్రామాల మధ్య నిర్మించే బీటీ రహదారి నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో రహదారులు అత్యంత కీలకమన్నారు. ప్రజలు ఎదురుచూస్తున్న రహదారి పనులను కూటమి ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తుందని తెలిపారు. రహదారులతో పాటు కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి విభాగాల్లో అభివృద్ధిని వేగవంతం చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఈగల దేవుళ్ళు, సర్ధం గోవిందు, పాకల ప్రసాద్, జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ డీడీకి షోకాజ్ నోటీసు

రంపచోడవరం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):అనర్హుడైన ఓ వార్డెన్‌కు అసిస్టెంట్ గిరిజన సంక్షేమాధికారిగా బాధ్యతలు కట్టబెట్టడంపై రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ తీవ్రంగా స్పం దించి, ఆ నియామకాన్ని రద్దు చేస్తూ అందుకు బాధ్యుడైన గిరిజన సంక్షేమ డీడీ రుక్మాంగడయ్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈవ్యవహారం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం కేం ద్రంగా గిరిజన సంక్షేమ విద్యాలయాలు, వసతి గృహాల పర్యవేక్షణకు నిర్దేశించిన సహాయ గిరిజన సంక్షేమాధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టుకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో గోకవరంలోని గిరిజన సంక్షేమ వసతిగృహం అధికారి జల్లి శంభుడుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ డీడీ ఈనెల2న ఉత్తర్వులు ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఈపోస్టు భర్తీకి అర్హుడైన అధికారి కోసం ఐటీడీఏ గాలిస్తుండగా, ఊహించని రీతిలో పీవోకి తెలియకుండా అదనపు బాధ్యతల అప్పగించడం, జరిగిన వారం రోజుల్లోపే ఈభాగోతం పీవో దృష్టికి చేరడంతో ఆయన తీవ్రంగా స్పందించారు.

ఆరోగ్యవంతమై బిడ్డను ప్రసవించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రౌతులపూడి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. రౌతులపూడి సీహెచ్‌సీ ఆసుపత్రిలో ప్రతినెలా 9న ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ పథకంలో గర్భిణులకు కత్తిపూడి సత్రం అందించే ఉచిత భోజనాలను ఎమ్మెల్యే వడ్డించారు. ముందుగా వైద్యులను ఓపీ వివరాలు తెలుసుకుని వైద్యులను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, ఆసుపత్రి డిడివో ఉమామహేశ్వరరెడ్డి, వైద్యులు ఎ.సౌమ్య, అజయ్, జి.పావని, బి.సౌమ్య, ఉమాదేవి, డైరెక్టర్లు రెడ్డి చిన్నయ్యనాయుడు, బండారు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును పరిశీలించిన జేసీ

తాళ్లరేవు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఇంజరం రాజరాజేశ్వరి ప్రవేటు రైస్‌మిల్లులో ధాన్యం కొనుగోలును జేసీ అపూర్వ భరత్ మంగళవారం పరిశీలించారు. ఇంజరం సచివాలయాన్ని జేసీ సందర్శించి సౌకర్యాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


శంఖవరంలో గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రసవానంతర సంరక్షణ ప్రభుత్వ లక్ష్యమని, గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మంగళవారం స్థానిక ఆసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు చేపట్టే పరీక్షల శిబిరాన్ని ఆమె పరిశీలించి గర్భిణుల బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ఆమె కత్తిపూడి బుచ్చిసీతాయమ్మరాణి వారి సత్రం ఏర్పాటు చేసిన భోజనాలను గర్భిణులకు వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు వెన్నా ఈశ్వరుడు, బద్ది రామారావు కూటమినేతల తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం


ఉద్యమ ఆధార్‌పై అవగాహన సదస్సు

కోటనందూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని ఏపీఎం సూర్యకుమారి తెలిపారు. మంగళవారం కోటనందూరు వెలుగు కార్యాలయంలో ఉద్యమ ఆధార్‌లో భాగంగా సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగా 42రకాల యూనిట్లకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అందుకోసం మహిళాశక్తి సంఘాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఏపీఎం విజయలక్ష్మి మాట్లాడుతూ ఉద్యమ ఆధార్ ద్వారా సర్టిఫికెట్ ఇచ్చి వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు ఎం.లోవలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు


యరకాపురంలో క్షేత్ర దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శంఖవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల సాగుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయాధికారి పి.గాంధీ పేర్కొన్నారు. మంగళవారం ఎరకాపురంలో రాగిపంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. అనంతరం పంటకోత ప్రయోగం నిర్వహించి 4.8కిలోల దిగుబడిని గమనించామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలను పరిశీలించి వివిధ రకాల కషాయాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండంగి ఉపాధ్యాయులతో నేడు డీఈవో సమీక్ష

తొండంగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ బుధవారం మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు తొండంగి అక్షర స్కూల్‌లో సమావేశం ఉంటుందన్నారు. మండలంలో గల అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రాథమిక తరగతులు ఉన్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఇప్పటివరకూ జరిగిన పరీక్షల గ్రేడింగ్ వివరాలు, రెమిడియల్ టీచింగ్ అవసరమైన విద్యార్థుల వివరాలు, ప్రగతి పత్రాలు, పాఠశాలకు చెందిన ఇతర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

'ఆదిత్య'లో నేటి నుంచి వాలీబాల్ చాంపియన్‌షిప్

గండేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ (పురుషుల) చాంపియన్‌షిప్ పోటీలు జేఎన్‌టీయూకే, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల రాజీవ్ గాంధీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్నటట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. టోర్నమెంట్ ఈ నెల 10 నుంచి 14 వరకు జరుగుతుందన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల నుంచి మొత్తం 138 జట్లు పాల్గొంటున్నాయన్నారు. నాకౌట్-కమ్-లీగ్ ఫార్మాట్‌లో పోటీలు ఉంటాయని వ్యాయామ ఉపాధ్యాయ విభాగాధిపతి డాక్టర్ రవి తెలిపారు. క్రీడాకారులకు భోజనం, వసతి రవాణా సౌకర్యాలు ఆదిత్య యాజమాన్యం సమకూర్చింది.

స్వర్ణ పంచాయతీ కార్యక్రమంపై ప్రచారం

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణపంచాయితీ కార్యక్రమంపై అన్నవరం పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో 4 బృందాలు ఏర్పాటు చేసి గ్రామంలో వివిధ పద్దులకు బకాయిలు ఉన్న సుమారు రూ.1.17 కోట్లను వసూలుచేయడంతో పాటుగా ఆయా వార్డుల్లో ఉన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని చక్రవర్తి తెలిపారు. గ్రామస్థులు సహకరించాలని ఆయన కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న కార్యదర్శి చక్రవర్తి

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రత్తిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పెద్దిపాలెం గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధితులకు ఓం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసరాలను అందజేశారు. పెద్దిపాలెంలో జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు గృహాలు దగ్ధమై రాళ్ళ అప్పారావు, రాళ్ళ రాజు, రాళ్ళ ఆనందరావు, పిల్లి అప్పలరాజు, తిమ్మి అప్పలనర్స, బొంద కాసులమ్మల కుటుంబాలు నిరాశ్రయులైన విషయం తెలిసిందే. ఆయా కుటుంబాలకు ఓం ఫౌండేషన్ సభ్యులు నిత్యావసరాలు, సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సుర్ల శ్రీనివాస్, గోళం విజయ్, ఆవాల ప్రసాద్, వాసంశెట్టి సూర్య అర్జున్, రాళ్ళ సీతారాం, కొరుప్రోలు సత్తిబాబు, నూకరాజు, పంపనబోయిన శ్రీను, గోవిందు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తరకంచిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ప్రత్తిపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరకంచి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో మంగవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జోకా అమృత మాట్లాడుతూ వరి కోతల అనంతరం రైతులు నేలను ఖాళీగా ఉంచకుండా సంవత్సరం పొడవునా ఏదో ఒక పంట సాగు చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ మంతెన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావు, వ్యవసాయ సహాయకులు కె.మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

గిరిజనాపురంలో బీజేపీ నేత చిలుకూరి పర్యటన


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ పూర్వ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజనాపురం గ్రామాన్ని మంగళవారం భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పర్యటించారు. గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో బీజేపీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ రక్ష సమితి కర్రి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.